# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-11-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పున్నమిఘాట్ నుండి శ్రీశైలం మధ్య 'సీ ప్లేన్' కార్యకమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ప్రారంభిస్తారు.**

**2.** **ప్రజల సహకారంతో మూసీనదిని ప్రక్షాళన చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

**3.** **గుంటూరు - వినుకొండ రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లో పౌరుల సమాచారాన్ని రియల్ టైం గవర్నెన్స్‌కు అనుసంధానించే చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు.**

**5.** **తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

============================

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పున్నమిఘాట్ నుంచి శ్రీశైలం మధ్య 'సీ ప్లేన్' కార్యకమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి కె. నవీన్ కుమార్ అందజేస్తారు.

**వాయిస్ 28 సెకన్లు**

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధితో పాటు, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సర రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బడ్జెట్ రూపకల్పనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బడ్జెట్‌లో రాజధాని నిర్మాణ పనులు, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల మరమ్మతులతో పాటు ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సూచించారు.

---------------------------

ప్రజల సహకారంతో మూసీనదిని ప్రక్షాళన చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామంలో నిన్న నిర్వహించిన 'మూసీ పునరుజ్జీవ సంకల్ప పాదయాత్ర'లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మూసీ నదిలో నీరు ఉన్నప్పటికీ వినియోగానికి వాడలేని పరిస్థితి ఉందని అన్నారు. మూసీ నదిని పరిశుభ్రం చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. 2025 జనవరి మొదటి వారంలో లక్షల మందితో కలసి నల్గొండ జిల్లా వాడపల్లి ప్రాంతం నుంచి మొదలుపెట్టి చార్మినార్ వరకు పాదయాత్ర చేస్తానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అంతకుముందు మూసీ పునరుజ్జీవ సంకల్పయాత్రలో భాగంగా సంగెం వద్ద నది పరివాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తూ ఆ ప్రాంతాలను పరిశీలించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు నగరానికి ప్రధానమైన గుంటూరు – వినుకొండ రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

**వాయిస్ 32 సెకన్లు**

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో లేని పౌరుల సమాచారాన్ని సేకరించి రియల్ టైం గవర్నెన్స్ –ఆర్టీజీఎస్ అనుసంధానించే చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. రియల్ టైం గవర్నెన్స్‌పై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని ఇళ్లనూ జీపీఎస్ ద్వారా అనుసంధానం చేయాలని సూచించారు. రియల్ టైం గవర్నెన్స్ ప్రధాన డేటా వనరుగా ఉండాలని తెలిపారు. జనన, మరణ ధ్రువీకరణ, నివాసం, ఆదాయం, విద్యార్హత లాంటి పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాలయాలకు వెళ్లకుండా ప్రజలకు వాట్సప్ గవర్నెన్స్‌ను అందుబాటులోకి తేవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణపై మంత్రివర్గ ఉపసంఘం నిన్న హైదరాబాద్‌లో సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటికే 30 లక్షల టన్నుల సామర్థ్యమున్న గోదాములను సిద్ధం చేశామన్నారు. కొనుగోళ్లలో జాప్యం జరగకుండా చూడాలని, మిల్లర్లు సహకరించనిచోట ధాన్యాన్ని నేరుగా గోదాములకు తరలించాలని అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిన్న నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం – సదస్సు'లో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర కోస్తా తీరం నాగరికతకు నెలవు అని అన్నారు. తెలుగు వారికి మాత్రమే ఉన్న గొప్ప సాహిత్య ప్రక్రియలు

పద్య నాటకం, పౌరాణిక నాటకాలు అని తెలిపారు. తెలుగు భాష చాలా ప్రాచీనమైన భాషా అని, దానికి సంబంధించిన లిఖిత పూర్వక ఆధారాలు భద్రపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఈ ఏడాది మొదటి పంట కింద ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరులో సాగునీటి సలహా బోర్డు సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని సోమశిల.. కండలేరు.. సర్వేపల్లి.. కనిగిరి జలాశయాలలో 140 టీఎంసీల మేర నీటి నిల్వ ఉందన్నారు. పంట కాలువలలో పూడికను తీయించేందుకు టెండర్లు పిలిచామని మంత్రి తెలుపుతూ,

**వాయిస్ 26 సెకన్లు**

---------------------------

తెలంగాణలోని మధిర పురపాలక సంఘం పరిధిలో ఈనెల 14 వ తేదీ నుంచి 'నేను.. నా మధిర క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాన్ని ప్రారంభించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కార్యకలాపాలపై నిన్న అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మధిరలో పారిశుద్ధ్య నిర్వహణను పెంచేందుకు, ప్రజల్ని భాగస్వామ్యం చేస్తూ 'నేను.. నా మధిర, క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాన్ని వినూత్నంగా చేపట్టనున్నామని చెప్పారు. పట్టణంలోకి ప్రవేశించే ప్రతిచోటా పచ్చదనం ఉట్టిపడేలా పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

పండగల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ ప్రత్యేక రైళ్లు సికింద్రాబాద్–విల్లుపురం మధ్య సేవలు అందించనున్నాయని అధికారులు తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్‌లో 14వ తేదీ రాత్రి 7 గంటల 40 నిమిషాలకు బయలుదేరి, మరుసటి రోజు శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట 5 నిమిషాలకు విల్లుపురం చేరుకుంటుందని, తిరుగు ప్రయాణంలో ఈనెల 15వ తేదీన విల్లుపురంలో సాయంత్రం 4 గంటల 5 నిమిషాలకు బయలుదేరి మరుసటి రోజు శనివారం ఉదయం 9 గంటల 40 నిమిషాలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని రైల్వే శాఖ తెలిపింది. ఈ రైళ్లు మౌలాలి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడురు, రేణిగుంట, కట్‌పాడి, తిరువన్నమలై స్టేషన్లలో ఆగుతాయని ప్రయాణికులు ఈ సర్వీసులను ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు.

---------------------------

తెలంగాణలో పదవ తరగతి పరీక్షల రుసుము చెల్లింపు తేదీలను ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 18వ తేదీ వరకు పరీక్ష రుసుము చెల్లించవచ్చని తెలిపింది. 50 రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబర్ రెండో తేదీ వరకు, 200 రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబర్ 12వ తేదీ వరకు, 500 రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబర్ 21వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొంది.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

పాస్‌పోర్ట్ దరఖాస్తు ముందస్తు నమోదు కోసం ఈ నెలలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి బుధవారం అదనపు అపాయింట్మెంట్ల కోసం ముందస్తుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని అన్నారు.

========================